ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం

- నేడు జిల్లాకు మోదీ రాక
- పటేల్‌గూడలో ఏర్పాట్లు పూర్తి
- సభా స్థలి వద్దే హెలీప్యాడ్
- కట్టుదిట్టమైన భద్రత
- విజయ సంకల్ప బహిరంగ సభలో ప్రసంగించనున్న ప్రధాని

7లో



నేటి నుంచి కేతకీలో నవాహ్నిక బ్రహ్మోత్సవాలు



ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం

ఝరాసంగం, మార్చి 4: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివ రాత్రి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి 13 వరకు వైభవంగా జరుగనున్నాయి, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు తెలంగాణ ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఆవరణలో బారికేడ్లు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు, పరిసరాల పరిశుభ్రత, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు.

ఆలయానికి చేరుకోండిలా..

జహీరాబాద్ పట్టణానికి 16 కిలోమీటర్ల దూరంలో కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం ఉన్నది. ఈ ఆలయానికి వచ్చేందుకు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ నుంచి జహీరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. జహీరాబాద్‌కు వచ్చాక ఆర్టీసీ అధికారులు జాతర సందర్భంగా ఝరాసంగంకు స్పెషల్ బస్సులు నడుపుతారు.

పూజా కార్యక్రమాలు..

5న అంకురార్పణం, ధ్వజారోహనం, విఘ్నేశ్వర పూజ, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఉదయం 11 గంటలకు స్వామివారికి శిఖర పూజ, 6న స్వామివారికి రుద్రాభిషేకం, రాత్రి పల్లకీసేవ, 7న సాయంత్రం శేషవాహన సేవ, రాత్రి పల్లకీసేవ, 8న మహాశివ రాత్రి, గణపతి హోమం, రాత్రి లింగోద్భవ మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, 9న నందివాహన సేవ, అగ్నిగుండం, 10న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రాత్రి విమాన రథోత్సం, 11న పల్లకీసేవ, అమ్మవారికి కుంకుమార్చన, 12న స్వామి అభిషేకం, రాత్రి పల్లకీసేవ, 13న స్వామివారికి అభిషేకం, స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించనున్నారు.

కొడుకు తీరుతో విసుగు చెంది కత్తులతో తండ్రి దాడి



దాడిలో గాయపడిన వంశీ


తూప్రాన్, మార్చి 4: కొడుకు తీరుతో విసుగు చెందిన తండ్రి మరొకరి సహాయంతో కొడుకుపై కత్తులతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య, విజయ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు గొల్ల వంశీ(25) వ్యవసాయం చేస్తుండగా, చిన్న కుమారుడు చదువుకుంటున్నాడు. మూడేళ్ల క్రితం వంశీకి వర్నికి చెందిన శిరీషతో వివాహమైంది. అప్పటికే తాగుడు, బెట్టింగులకు వంశీ అలవాటు పడటంతో భార్యను నిత్యం కొడుతుండడంతో ఆమె పుట్టింటికి వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. దాంతో తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొడుకు తీరుతో విసుగు చెందిన తల్లి విజయ ఆరునెలల క్రితం విషం తాగి ఆత్మహత్య చేసుకున్నది. అయితే కొడుకు రూ.20 లక్షల అప్పులు చేయడంతో తండ్రి భూమి అమ్మి తీర్చాడు. అయినా అతడిలో మార్పురాకపోగా.. బాగా తాగడం, బెట్టింగ్‌లు చేస్తున్నాడు. దీంతో విసుగు చెందిన తండ్రి ఆదివారం ఇంట్లో ఉండొద్దంటూ బట్టలు బయట పడేశాడు. అర్ధరాత్రి వంశీ మద్యం సేవించి ఇంటికి రాగా.. తండ్రి తలుపులు తీయకపోవడంతో ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడిన వంశీ తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆవేశానికి గురైన తండ్రి కిష్టయ్యతో పాటు ఇంట్లో పడుకున్న ట్రాక్టర్ డ్రైవర్ కొండాపురం లక్ష్మణ్ కలిసి వంశీపై కత్తులతో విచక్షణారహితంగా దాడిచేశారు. ఈ దాడిలో వంశీ చేతులు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్థులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కాగా వంశీపై దాడికి పాల్పడిన ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

దుబ్బాక, మార్చి 4: భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాకకు చెందిన బాలే బాల్‌రాజ్ కుమారుడు అవినాష్(35) ఏడాదిన్నర క్రితం లచ్చపేటకు చెందిన మహమూద్ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకుని దుబ్బాక పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద అద్దెకు ఉంటున్నాడు. రెండు నెలల నుంచి భార్యతో గొడవ జరగ్గా.. ఆమె పుట్టింటికి వెళ్లి రావడం లేదు. అయితే అవినాష్ మూడురోజుల నుంచి తలుపులు తీయడం లేదు. సోమవారం సాయంత్రం సదరు ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇంటి యజమాని మూడ శివ సహాయంతో పైకప్పు తెరిచి చూడగా అవినాష్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే మృతదేహాన్ని కిందకు దింపి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గంగారాం తెలిపారు.



పటేల్‌గూడ వద్ద సభా ప్రాంగణంలో జనం కుర్చునేందుకు ఏర్పాటు చేసిన గ్యాలరీ



విజయ సంకల్ప సభా వేదిక

ప్రధాని పర్యటనకు
సర్వం సిద్ధం

నేడు సంగారెడ్డి జిల్లాకు మోదీ రాక

- పటేల్‌గూడలో ఏర్పాట్లు పూర్తి
- సభా స్థలి వద్దే హెలీప్యాడ్
- కట్టుదిట్టమైన భద్రత
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

పటాన్‌చెరు, మార్చి 4 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంగారెడ్డి జిల్లా పర్యటనకు సర్వం సిద్ధమైంది. పటాన్‌చెరు శివారులోని పటేల్‌గూడ ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాల పక్కన సభా ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాని నరేంద్రమోదీతో పాటు గవర్నర్ తమిళిసై, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొనున్నారు. ప్రధాని, సీఎం పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ప్రాంగణాన్ని ఎస్‌పీఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీసులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రూపేష్ అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభా స్థలిలో సుమారు లక్ష మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంలోనే రెండు హెలీప్యాడ్‌లను నిర్మించారు. అత్యవసరంగా పటాన్‌చెరు శివారులోని ఇక్రీశాట్‌లో మరో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. సోమవారం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ హెలీకాఫర్‌లు, ప్రధాని కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు.

విజయ సంకల్ప బహిరంగ సభలో ప్రసంగించనున్న ప్రధాని

మంగళవారం ఉదయం 9.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా సభా స్థలి సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగనున్నారు. తొలుత పలు అభివృద్ధి పనులను ప్రధాని మోదీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అలాగే వర్చువల్‌గా పలు ప్రగతి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరిగివెళ్లిపోతారు. తర్వాత నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. బహిరంగ సభకు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి నుంచి సుమారు లక్ష మంది జనసమీకరణ చేసేందుకు బీజేపీ నాయకత్వం కార్యాచరణ రూపొందించారు.

రూ.9,021 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో మొత్తం రూ.9,021కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను వర్చువల్‌గా చేస్తారు. పూణే - హైదరాబాద్ రహదారిలో సంగారెడ్డి క్రాస్ రోడ్డు మీదుగా మదీనగూడ వరకు రూ.1,298 కోట్లతో ఆరులేన్ల జాతీయ రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. రూ.399 కోట్లతో మెదక్ ఎల్లారెడ్డి రెండో లైన్ హైవే విస్తరణ పనులకు, రూ.500 కోట్లతో ఎల్లారెడ్డి రుద్రూర్ హైవే పనులకు శంకుస్థాపనలు చేస్తారు. రూ.3,338 కోట్లతో ఏర్పాటు చేసిన పారాదీప్ హైదరాబాద్ గ్యాస్ పైపులైన్‌ను జాతికి అంకితం చేస్తారు. రూ.400 కోట్లతో నిర్మించిన సివిల్ ఏవియేషన్ రిసెర్చ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. రూ.1,409 కోట్లతో నిర్మించిన కంది రాంసాన్‌పల్లి నాలుగు లేన్ల జాతీయ రహదారిని ప్రారంభిస్తారు. రూ.323 కోట్లతో నిర్మించిన మిర్యాలగూడ, కోదాడ రెండో లైన్ జాతీయ రహదారిని, రూ.1165 కోట్లతో నిర్మించిన హైదరాబాద్ - సికింద్రాబాద్ పరిసరాలలో ఎంఎంటీఎస్ రెండో దశ పనులను ప్రారంభిస్తారు.

ట్రాఫిక్ ఆంక్షలు

మంగళవారం ప్రధాని పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. ప్రధాని సభకు పలు నియోజకవర్గాల నుంచి హాజరయ్యే వారికి సంగారెడ్డి ఎస్పీ రూపేష్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. పటాన్‌చెరు శివారులోని ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాల పక్క ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు చేరుకునేందుకు ప్రత్యేక రూట్లను కేటాయించారు. కామారెడ్డి, రామాయంపేట, తూప్రాన్ వైపు నుంచి వచ్చే వాహనాలు శామీర్‌పేట వద్ద, మెదక్, నర్సాపూర్ నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు గుండ్లపోచంపల్లి వద్ద, సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట నుంచి వచ్చే బస్సులు ముత్తంగి ఔటర్‌రింగ్ రోడ్డు ఎగ్జిట్ మూడు వద్ద, హత్నూర, దౌల్తాబాద్ నుంచి వచ్చే వాహనాలు సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ వద్ద దిగి కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడా, ఎల్లంకి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలిపి సభావేదిక వద్దకు నడుచుకుంటూ వెళ్లాలని సూచించారు. కార్లలో వచ్చే వారికి ప్రత్యేకించి రామేశ్వరంబండలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో నిలుపుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను బీరంగూడా కమాన్ నుంచి లోనికి అనుమతించరు. పటాన్‌చెరు శివారులోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్ నుంచి పటేల్‌గూడా కిష్టారెడ్డిపేట రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించారు.

డ్రోన్‌లపై నిషేధం : కలెక్టర్

సంగారెడ్డి రూరల్, మార్చి 4 : పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో ఈ నెల 5వ తేదిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ, పలు అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నందున జిల్లా వ్యాప్తంగా డ్రోన్‌ ఎగరవేతను నిషేధించినట్లు కలెక్టర్ వల్లూరి క్రాంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా, ఇక్రిశాట్ పరిసర ప్రాంతాలతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ ప్రాంగణానికి రెండు కిలోమీటర్ల మేర రెడ్ అలర్ట్ విధిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



సభా స్థలి వద్ద మోదీ కటౌట్

తెలంగాణలో 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలుపు

- కేసీఆర్ అవినీతిపై శిక్షించాలనే ఆలోచన కాంగ్రెస్‌కు లేదు
- నేటి మోదీ సభ మంచి ప్రభావం చూపిస్తుంది
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి
- మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

సంగారెడ్డి అర్బన్, మార్చి 4: తెలంగాణ రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డితో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు పటాన్‌చెరులో జరగబోయే భారత్ విజయసంకల్ప సభ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ప్రభావం చూపిస్తుందని ధీమావ్యక్తం చేశారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. అన్ని పార్లమెంట్ స్థానాల్లో మంచి మెజారిటీతో గెలవాలనే ప్రయత్నం చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలను బయటకు తీయడం మంచిదే అయినప్పటికీ అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్‌కు శిక్షించాలనే ఆలోచనే లేదని పేర్కొన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డపై ముందే ఎందుకు కమిటీ వేయలేదని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఓట్ల కోసమే కమిటీల పేరిట డ్రామాలాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయిందని అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇంటికి పంపారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి ఎవరొచ్చినా బీజేపీలోకి ఆహ్వానిస్తామని, తెలంగాణ అభివృద్ధికి ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలని సూచించారు. తెలంగాణలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉంటే తొమ్మిది లక్షల కోట్ల అభివృద్ధి జరిగిందని, అలాంటప్పుడు అన్ని స్థానాల్లో బీజేపీ గెలిపిస్తే ఇంకెంత అభివృద్ధి చెందుతుందో గ్రహించాలన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం, తద్వారా మరో ఐదేళ్లలో భారత్ అగ్రరాజ్యంగా ఎదగడం ఖాయమన్నారు. మోదీ సభకు లక్షకుపైగా జనసమీకరణ చేస్తున్నామని, ఉదయం 11.30 గంటలకు సభ ప్రారంభమౌతుందని, ప్రజలు తరలి వచ్చి మోదీ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గురువారెడ్డి, జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు పులిమామిడి రాజు, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, సంగమేశ్వర్, మాణిక్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోవాలి

- సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 4: ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ఆయా ఫిర్యాదులకు, అర్జీలకు సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కార మార్గం చూపాలన్నారు. ప్రజావాణికి మొత్తం 42 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన వారిని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోపలికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలను బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేసింద్రు

1999లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలో 2.20 ఎకరాల భూమిని 80 మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలకు ఇచ్చి పట్టాలు అందించారని, దీనిని బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేశారని కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన మహిళలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి మీ స్థలాన్ని అందేలా చూస్తానని కలెక్టర్ హామీఇచ్చారు.

మా భూమిని మాకు ఇవ్వాలి

మా భూమి మాకు ఇవ్వాలని రంగధాంపల్లికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మిట్టపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని 966 సర్వే నెంబర్లు 1.21 ఎకరాల భూమిని దహన సంస్కారాలకు కేటాయించామని, ఎలాంటి సమాచారం లేకుండా త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం ప్రొసీడింగ్ ఇచ్చారని అన్నారు. దానిని వెంటనే రద్దు చేసి శ్మశానానికి కేటాయించి నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

నెరవేరిన జూనియర్ లెక్చరర్ కళ



మహిపాల్‌రెడ్డి

మద్దూరు, మార్చి 4: ఎన్నోఏళ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్లు లేక.. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే పట్టుదలతో చదివి ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు మద్దూరు మండలం మర్మాముల గ్రామానికి చెందిన గుండ్రెడ్డి మహిపాల్‌రెడ్డి. గ్రామానికి చెందిన గుండ్రెడ్డి వెంకటమ్మ, వీరనర్సింహారెడ్డి దంపతులకు నలుగురు కుమారులు. ఇందులో మహిపాల్‌రెడ్డి చిన్నవాడు. సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా జాబ్ చేస్తున్నాడు. గురుకుల నోటిఫికేషన్ పడడంతో.. జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించాలని రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలు రాశాడు. దీంతో రాష్ట్రస్థాయిల్ జేఎల్ కామర్స్‌కు-13వ ర్యాంకు, పీజీటీకి-15వ ర్యాంకు, టీజీటీకి-18వ ర్యాంకు సాధించి.. ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికై ఔరా అనిపించుకున్నాడు. కష్టపడ్డందుకు ఫలితం దక్కిందని, ఆనందంగా ఉన్నదని మహిపాల్‌రెడ్డి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

సిద్దిపేట క్రైం, మార్చి 4: దొంగతనం, పోగొట్టుకున్న 63 ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్ పడిపోయినా, ఎవరైనా దొంగిలించినా సీఈఐఆర్‌లో డాటా నమోదు చేస్తే స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. 2023 ఏప్రిల్ 20 నుంచి ఇప్పటి వరకు 440 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు సీఈఐఆర్ పోర్టల్‌లో జిల్లాలో 2100 మంది సెల్‌ఫోన్లు పోయినట్లు నమోదు చేసుకున్నారని, వాటిలో 657 సెల్ ఫోన్లు ట్రేస్ అవుట్ చేసి.. 440 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అపర్ణపాటిల్

- ఏకగ్రీవంగా ఎన్నిక
- పార్టీలు పక్కనపెట్టి మద్దతు తెలిపిన కౌన్సిలర్లు

సదాశివపేట, మార్చి 4 : సదాశివపేట మున్సిపల్ నూతన చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ చీలిక వర్గానికి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణ పాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీలో 26 మంది కౌన్సిలర్లు ఉండగా 18 మంది మద్దతుతో అపర్ణపాటిల్ చైర్‌పర్సన్‌గా పదవీ ప్రమాణం చేశారు. ఫిబ్రవరి 9న నిర్వహించిన సమావేశంలో 21 మంది కౌన్సిలర్ల ఓట్లతో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో చైర్‌పర్సన్‌గా ఉన్న పిల్లోడి జయమ్మ పదవిని కోల్పోయారు. సోమవారం కొత్త చైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించారు.

18 మంది కౌన్సిలర్ల మద్దతు

స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

ఉదయం 11 గంటలకు ప్రిసైడింగ్ అధికారి, సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోరంకు అవసరమైన 19 మంది కౌన్సిల్ సభ్యులు హాజరవడంతో ఆర్డీవో ఎన్నిక జరిపారు. 23వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇంద్రమోహన్‌గౌడ్ కొత్త చైర్‌పర్సన్ అభ్యర్థిగా బీఆర్ఎస్ చీలిక వర్గానికి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణపాటిల్ పేరును ప్రతిపాదించారు. 20వ వార్డు కౌన్సిలర్ ఆకుల శివకుమార్ బలపరిచారు. 18 మంది కౌన్సిలర్లు అనుకూలంగా మద్దతును ప్రకటించారు. దీంతో ఆర్డీవో వసంతకుమారి కొత్త చైర్‌పర్సన్‌గా అపర్ణపాటిల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువీకరించారు. అనంతరం చైర్‌పర్సన్ అపర్ణపాటిల్ పదవీ ప్రమాణం చేశారు.

మద్దతు తెలిపిన కౌన్సిలర్లు వీరే..

కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక ప్రత్యేక సమావేశంలో 19 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ముంతాజ్‌బేగం, రేష్మాబేగం, రజియాబేగం, నస్రీన్‌బేగం, వడ్ల మహేశ్వరి, నల్ల శివలక్ష్మి, ఇంద్రమోహన్‌గౌడ్, చౌదరి ప్రకాష్, విద్యాసాగర్‌రెడ్డి, చింతా గోపాల్, ఆకుల శివకుమార్, బీజేపీ కౌన్సిలర్ ఓదెల రాజేశ్వరి, ఎంఐఎం పార్టీ కౌన్సిలర్లు ఖుద్దుస్ ఖురేషీ, షహజాదీబేగం, బీఆర్ఎస్‌లో చేరిన స్వతంత్ర కౌన్సిలర్ ఇలియాజ్‌షరీఫ్‌తో పాటు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన కౌన్సిలర్లు పిచరాగడి రేణుక, సాతాని లలిత, నేనావత్ శ్రీనివాస్ అపర్ణపాటిల్‌కు మద్దతు పలికారు. చైర్‌పర్సన్ ఎన్నికలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలేవి విప్ నోటీసులను ప్రిసైడింగ్ అధికారికి అందజేయలేదు.



చైర్‌పర్సన్‌గా ఎన్నికైన అపర్ణపాటిల్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న ఆర్డీవో వసంతకుమారి

రేపు తూప్రాన్ మున్సిపల్ అవిశ్వాస సమావేశం

తూప్రాన్, మార్చి 4: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశం బుధవారం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. మున్సిపాలిటీలో 16 మంది కౌన్సిలర్లు ఉండగా, అవిశ్వాస తీర్మానంపై 11 మంది కౌన్సిలర్లు సంతకం చేసి గతనెల 11న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో క్యాంపునకు వెళ్లారు. చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ వర్గం ఐదుగురితో క్యాంపునకు తరలివెళ్లింది. అవిశ్వాసంపై సంతకం చేసిన రెండో వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ ఇంటి వద్ద పనుందంటూ వచ్చి చైర్మన్ వర్గంలో కలిసిపోయాడు. దీంతో చైర్మన్ వర్గంలో ఆరుగురయ్యారు.

భూకబ్జా కేసులే కీలకం!

తూప్రాన్ పట్టణంలోని పుట్టకోటలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి విక్రయించారంటూ ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. సర్వే ఆధారంగా కౌన్సిలర్, ఇద్దరు మహిళా కౌన్సిలర్ల భర్తలపై పోలీసులు నాలుగు రోజుల క్రితం క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అవిశ్వాసంలో పోలీసులు కేసులు కీలకం కానున్నట్లు ప్రచారం జరుగుతుంది.

ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు

మెదక్ అర్బన్, మార్చి 4: ప్రభుత్వం ప్రారంభించిన గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు లబ్ధిదారులకు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుకు ఆదేశించింది. సోమవారం మెదక్ జిల్లాలోని పలు చోట్ల ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభమయ్యాయి.

అన్ని పని దినాల్లో..

గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల కింద లబ్ధి పొందని పేదలకు ప్రయోజనం కల్పించడమే లక్ష్యంగా ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. అర్హులైన వారి వివరాలను నమోదు చేసుకునేందుకు జిల్లాలోని అన్ని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. అన్ని పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవా కేంద్రాలు కొనసాగనున్నాయి.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశం

సంగారెడ్డి రూరల్, మార్చి 4: సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశం తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీదారుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం అందుబాటులో ఉంటారని తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు.



సంగారెడ్డిలో అర్జీలు స్వీకరిస్తున్న ఏవో పరమేశం

మెదక్‌లో 134 అర్జీలు

మెదక్ అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 134 అర్జీలను అందజేసినట్లు అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్ తెలిపారు. ప్రజావాణి ద్వారా వస్తున్న అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.



మెదక్‌లో అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్

పోలీసు ప్రజావాణి

మెదక్ అర్బన్: జిల్లా పోలీసు కార్యాయలంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ బాలస్వామి ప్రజలను అర్జీలను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

ఏడుపాయల జాతరపై ఎమ్మెల్యే సమీక్ష

మెదక్ అర్బన్, మార్చి 4: మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత జాతరపై సోమవారం సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈసారి దాదాపు 7లక్షల మంది అమ్మవారి దర్శనం కోసం రానున్నట్లు అంచనా వేశామన్నారు. ఈ నెల 8నుంచి మూడు రోజులపాటు జరగనున్న జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతరలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా 20 వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. నాలుగు అంబులెన్సులు, 10మెడికల్ క్యాంపులు, 250 మంది వైద్య సిబ్బంది, కావాల్సిన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. టికెట్, ప్రసాద కౌంటర్లను పెంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్, ఆర్డీవో రమాదేవి పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రధాని చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి రూరల్, మార్చి 4: తెలంగాణ రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ రైతులు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మెజారిటీ రైతులు వారి సంపాదనలో అధికభాగం ప్రైవేటు అప్పులకు అధిక వడ్డీలు చెల్లిస్తూ నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సాగుకు పెట్టిన పెట్టుబడికి మూడు రెట్లు అధికంగా ఉండేలా ఎమ్మెస్పీ నిర్ణయించాలని కోరారు. ఎలాంటి ష్యూరిటీలు లేకుండా రూ.ఐదు లక్షల వరకు ప్రేత్యక రుణం బ్యాంకుల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను అడ్డుకుంటాం: సీపీఎం

సంగారెడ్డి రూరల్, మార్చి 4: సంగారెడ్డి జిల్లాను పట్టించుకోకుండా జిల్లాలో పర్యటిస్తున్న ప్రధాని మోదీని అడ్డుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ హెచ్చరించారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక జిల్లాగా పేరుగాంచిన సంగారెడ్డిలో లక్షలాది మంది కార్మికులు కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని దేశవ్యాప్త సమ్మె చేస్తే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్న మోదీకి సంగారెడ్డి జిల్లాలో పర్యటించే నైతిక హక్కు లేదన్నారు. సమావేశంలో సపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం, నాయకులు యాదగిరి, అశోక్, బాబురావు, రమేష్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

వలసలు నివారించకుండా పర్యటన ఎందుకు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో వలసల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా ప్రధాని మోదీ సంగారెడ్డి జిల్లాలో పర్యటించడం ఏమిటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం ప్రశ్నించారు. ప్రధాని మోదీకి ప్రజల ఓట్లపై ఉన్న శ్రద్ధ వెనుకబడిన ప్రాంతాలపై లేదన్నారు. ప్రధానికి వెనుకబడిన ప్రాంతాలపై చిత్తశుద్ధి ఉంటే వలసల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

స్టోన్ క్రషర్లలో తనిఖీలు

జిన్నారం, మార్చి 4: మాదారం పరిధిలోని పలు స్టోన్ క్రషర్లలో సెంట్రల్ మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. మాదారం యువజన సంఘాల ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు.

జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ టికెట్ భూపాల్‌రెడ్డికి ఇవ్వాలి

కల్హేర్, మార్చి 4: జహీరాబాద్ ఎంపీ బీఆర్ఎస్ టికెట్ నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ఇవ్వాలని పార్టీ యూత్ విభాగం మండలాధ్యక్షుడు సంతోష్‌కుమార్, సీనియర్ నాయకుడు నీరుడి యాకోబు కోరారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండే భూపాల్‌రెడ్డికి టికెట్ ఇస్తే విజయం సాధిస్తాడని తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

కోహీర్, మార్చి 4: పైడిగుమ్మల్ గ్రామంలో సోమవారం రోటరీ క్లబ్ సభ్యులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం, ఎంపీటీసీ రత్నయ్య, మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి పాల్గొన్నారు.

లైబ్రరీలో డిస్పెన్సర్ ఏర్పాటు

నారాయణఖేడ్, మార్చి 4: పట్టణంలోని గ్రంథాలయంలో రీడర్స్ కోసం చల్లటి నీటిని అందించేందుకు వాటర్ డిస్పెన్సర్‌ను సోమవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఏర్పాటు చేయించారు. గ్రంథాలయంలో పాఠకులకు మెరుగైన సదుపాయలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

మనోహరాబాద్, మార్చి 4: మండలంలోని పర్కిబండ గ్రామంలో సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌కు గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా మాధవి

మాసాయిపేట, మార్చి 4: మాసాయిపేట మండల అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్‌గా కె.మాధవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీ ఎన్నికలకు ముందే పెండింగ్ డీఏ చెల్లించాలి

సంగారెడ్డి అర్బన్, మార్చి 4: ఎంపీ ఎన్నికలకు ముందే పెండింగ్ డీఏ విడుదల చేయాలని టీపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ ఎం.సోమశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలను ఇవ్వకుండా గత ప్రభుత్వం పెండిగ్‌లో పెడుతూ వచ్చిందన్నారు. కొత్త ప్రభుత్వం రాకతో డీఏలు విడుదల చేస్తారని ఆశించినా సాగదీత ధోరణిని అవలంబిస్తూ తీవ్ర నిరాశకు గురి చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు.

క్రీడా స్థలంలో గ్రంథాలయం వద్దు

వెల్దుర్తి, మార్చి 4: వెల్దుర్తిలోని ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటేశం, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ క్రిష్ణాగౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు జిల్లా పరిషత్ సీఈవో మల్లయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రంథాలయ సంస్థ పేరిట చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న పాత గ్రంథాలయ భవనాన్ని తొలగించి అక్కడే నూతన భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తానని జడ్పీ సీఈవో తెలిపినట్లు వారు తెలిపారు.

ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, మార్చి 4: ఎస్సీ నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రం బ్రాంచ్ మేనేజర్ ఆసిఫా బేగం సోమవారం ప్రకటనలో తెలిపారు. మూడు నెలల వ్యవధిలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. 18 సంవత్సరాల నుంచి 35 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులని చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి, అర్హత గల వారు సంగారెడ్డిలోని సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సమాచారం కోసం 8309940165 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



చిన్నహైదరాబాద్ గ్రామంలో అవగాహన కల్పిస్తున్న ఉద్యాన కళాశాల విద్యార్థులు

జహీరాబాద్, మార్చి 4: పంటలసాగులో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఉద్యానవన కళాశాల విద్యార్థులు మండలంలోని చిన్నహైదరాబాద్ గ్రామంలో సోమవారం పంటలసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ... రైతుల అనుభవాలు, విద్యార్థులు నేర్చుకున్న చదువు రెండుకలిస్తే పంటల సాగుకు మరింత ఉపయోగకరంగా మారనుందన్నారు.

వట్‌పల్లికి 30 పడకల ఆస్పత్రి

వట్‌పల్లి, మార్చి 4: మండల కేంద్రమైన వట్‌పల్లిలో 30పడకల ఆస్పత్రితో పాటు డయాలసిస్ సెంటర్‌ను ప్రభుత్వం సోమవారం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆస్పత్రి నిర్మాణానికి రూ.11.20 కోట్లు మంజూరు చేశారు. ఈ నెల 9న రాష్ట్ర వైద ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రమేష్ జ్యోషి తెలిపారు.

'లింగాయత్ కమిషన్ ఏర్పాటు చేయాలి'

నారాయణఖేడ్, మార్చి 4: లింగాయత్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేష్ షెట్కార్, లింగాయత్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.సంగమేశ్వర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి విన్నవించారు. లింగాయత్ కమిషన్‌ను ఏర్పాటు చేయడం వల్ల లింగాయత్‌లకు మేలు జరుగుతుందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో లింగాయత్ సమాజ్ రాష్ట్ర నాయకులు బిడెకన్నే హన్మంతు, గుండప్ప, తదితరులు ఉన్నారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

కొండాపూర్, మార్చి 4: నర్సరీల్లో పెంచుతున్న మొక్కల చుట్టూ పెరిగిన కలుపు మొక్కలను తొలగించాలని ఎంపీడీవో జ్యోతిలక్ష్మి ఎఫ్ఏలకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని మల్కాపూర్, చెర్లగోపులారం, తెర్పోల్, మాచెపల్లి, దొబ్బకుంట గ్రామాల నర్సరీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పని ప్రదేశంలో వసతులను కల్పించాలని సూచించారు.

జాతీయ భద్రతా వారోత్సవాలు షురూ

జిన్నారం, మార్చి 4: జిన్నారం, బొల్లారం, కాజీపల్లి పారిశ్రామిక వాడల్లో సోమవారం 53వ జాతీయ పారిశ్రామిక భద్రతా దినోత్సవం సందర్భంగా వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమలలో కార్మికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 10వరకు వారోత్సవాలు జరుగనున్నాయి.

ఇండస్ పాఠశాలలో సైన్స్‌దినోత్సవం

జహీరాబాద్, మార్చి 4: రంజోల్ గ్రామంలో గల ఇండస్ యూనివెర్సల్ పాఠశాలలో సోమవారం సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధరకాల అంశాలపై ప్రదర్శనలను నిర్వహించారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సైన్సు ప్రదర్శనలు దోహదపడుతాయని డైరెక్టర్ చంద్రకళ, ప్రిన్సిపాల్ స్వాతిప్రియ అన్నారు. విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

అధికారులు హాజరైతేనే సమస్యలు తెలుస్తాయి

- మెదక్ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ అర్బన్, మార్చి 4: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యమున అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రతి పేదవాడికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో మత్తు పదార్థాలు విక్రయించకుండా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ సమావేశానికి అధికారులందరూ హాజరైతేనే సమస్యలు తెలుస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు శ్రీహరి, ప్రభాకర్ తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అంజనేయులు, ఎంపీడీవో రఘు, మెదక్, మాచవరం పీఏసీఎస్‌ల చైర్మన్లు హన్మంత్‌రెడ్డి, సీతారామయ్య, వివిధ శాఖల అధికారులు శ్రీహరి, నీలకంఠం, లక్ష్మణ్, సల్మాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సమన్వయంతోనే ప్రజా సమస్యల పరిష్కారం

- గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇవ్వండి
- హత్నూర మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, మార్చి 4: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం ఎంపీపీ వావిలాల నర్సింహులు అధ్యక్షతన నిర్వహించిన హత్నూర మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సూచించారు. కాగా సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శంకర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు పండుగ లక్ష్మీకుమార్, తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఎంపీడీవో శంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- బైక్‌ను ఢీకొని పరారైన గుర్తుతెలియని కారు

పటాన్‌చెరు, మార్చి 4: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగింది. పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా సీసీ కెమెరాల ఆధారంగా బైక్‌ను ఢీకొట్టిన కారును గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ప్రియుడి మోజులో భర్త హత్య

- చిప్పల్‌తుర్తి కేసును ఛేదించిన పోలీసులు

నర్సాపూర్, మార్చి 4: గత నెల 29న నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి సమీపంలో ఓ మృతదేహాన్ని పోలీసులు గుర్తించి, కేసు నమోదు చేయగా.. ఆ కేసును ఛేదించారు. సోమవారం నర్సాపూర్‌లో పోలీసులు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన దుర్గేష్(28), భార్గవి దంపతులు. దుర్గేష్ మేస్త్రీ పని చేస్తుండగా.. భార్గవి రాజకీయ పార్టీల మీటింగుల్లో పాటలు పాడుతుంటుంది. నల్లవల్లికే చెందిన కళాకారుడు బాల అశోక్‌తో కలిసి భార్గవి మీటింగులకు వెళ్లి పాటలు పాడేది. ఈ క్రమంలో ఇద్దరికి వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం తెలిసిన దుర్గేష్ భార్యను కొట్టేవాడు. దీంతో అడ్డు తొలగించుకోవాలని భావించిన భార్గవి, ఆమె ప్రియుడు బాల అశోక్ కలిసి దుర్గేష్‌ను చంపేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 29వ బాల అశోక్ తన స్నేహితులు గొల్ల మహేష్, సంతోష్, పర్వతాలుకు విషయం చెప్పాడు. కౌడిపల్లి మండలం తుంకిలోని నల్లపోచమ్మ ఆలయానికి దుర్గేష్‌ను రప్పించి మద్యం తాగించారు. అనంతరం నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, టీషర్టుతో గొంతు పిసికి, తలపై రాయితో కొట్టి చంపి పరారయ్యారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు హత్యకు కారణమైన భార్యతో పాటు నలుగురు నిందితులను సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు.

పాత కక్షలతో ఇరు వర్గాల ఘర్షణ

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 4: సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఏడుగురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రాసోలం, గైని అనే రెండు కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కట్టెలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాల ఘర్షణలో రాసోలం ధన్‌రాజ్, హన్మంతు, సాయిలు, ఆకాష్, బశప్ప, గైని అశోక్, గైని మశ్చందర్ గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలుపడానికి స్థానిక పోలీసులు సకాలంలో స్పందించలేదు.

11 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసు

సంగారెడ్డి అర్బన్, మార్చి 4: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 11మంది విద్యార్థులపై సోమవారం కేసు నమోదైంది. న్యాల్‌కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10 మంది, నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి



ఎంపీపీని సన్మానిస్తున్న జడ్పీటీసీ మల్లికార్జున్

రాయికోడ్, మార్చి 4: వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్ సూచించారు. సోమవారం ఎంపీపీ సింగాపూర్ మొగులప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, ఎంపీపీ మొగులప్ప మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కాగా సర్వసభ్య సమావేశానికి కాంగ్రెస్ ఎంపీటీసీలు దూరంగా ఉన్నారు. అధికారులు తమ శాఖల నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో షరీఫ్, పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, ఎంపీటీసీలు శివకుమార్‌పాటిల్, నిరంజన్, సత్యమ్మ, కో ఆప్షన్ సభ్యుడు అబిద్‌మియా పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

జహీరాబాద్, మార్చి 4: మహిళలు పురుషులకు దీటుగా అన్నిరంగాల్లో రాణించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరికృష్ణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని హోతి(కే)లో గల బాలికల గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహ బాధితులు, బాలకార్మికుల సమాచారాన్ని తహసీల్ కార్యాలయ అధికారులకు, పోలీసులకు, 1098 నంబర్‌కు తెలిపాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు మాణెన్న, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

మహిళలకే విజయావకాశాలు..

జహీరాబాద్, మార్చి 4: రంగం ఏదైనా విజయావకాశాలు మహిళలకే సొంతం అవుతాయని శ్రామిక్ విజ్ఞాన్‌కేంద్రం నిర్వాహకులు విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్‌బిహెచ్‌కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ముగ్గులపోటీలు, స్కిప్పింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు శ్రామిక్‌విజ్ఞాన్‌కేంద్రం ఆధ్వర్యంలో వివిధరకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శ్రామికవిజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 9న బహుమతులను అందజేస్తామన్నారు.

విద్యార్థులకు అవగాహన

నిజాంపేట, మార్చి 4: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావోపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికల జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్యం, మహిళా సాధికారికత గురించి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కమిషన్ కో ఆర్డినేటర్ సంతోషి, జెండర్ స్పెషలిస్టు కవిత, జీవన నైపుణ్య శిక్షకురాలు కొరిపాటి సునీత అన్నారు. అనంతరం మహిళా సాధికారికత, పోక్సోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షుడు దేవయ్య
- రైతులతో కలిసి ధర్నా

హవేళిఘణపూర్, మార్చి 4: ప్రభుత్వం పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని వ్యావసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద శమ్నాపూర్ గ్రామానికి చెందిన రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పోడు భూముల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పట్టాలివ్వాలన్నారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న రైతులకు కూడా పట్టాలు ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి మల్లేశం, లచ్చాగౌడ్, రాజయ్య, శ్రీను, గంగయ్య, మల్లేశం పాల్గొన్నారు.



హవేళిఘణపూర్ తసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



చైర్మన్‌గా కుమార్, వైస్ చైర్మన్‌గా కృష్ణ ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

సదాశివపేట, మార్చి 4: సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూర్పు నిర్మలాజగ్గారెడ్డి హాజరయ్యారు. జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా సదాకుల కుమార్, వైస్ చైర్మన్‌గా కంది కృష్ణగుప్తా, డైరెక్టర్లు గడీల నరేందర్‌గౌడ్, చిరంజీవి(చిరు), విశ్వనాథ్ కళావతి, జి.ప్రకాష్‌గౌడ్, చౌహన్‌సోమ్లా, పి.శివకుమార్, సయ్యద్‌యూసుఫ్, ఎన్.మధుకర్‌రెడ్డి, బి.శైలేందర్, కె.శేఖర్, కె.లక్ష్మణ్‌కుమార్, కె.రమేష్, ఎం.మాణిక్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ విభాగ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ, చాట్ల సిద్ధన్న, కౌన్సిలర్లు నాగరాజుగౌడ్, గుండు రవి, శంకర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ రాయిపాడ్ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పది పరీక్షలపై అవగాహన

వెల్దుర్తి, మార్చి 4: ఒత్తిడి, భయానికి లోను కాకుండా ప్రశాంతంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయాలని జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ అన్నారు. సోమవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ప్రణాళికను తయారు చేసుకుని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఆయనవెంట ఎంఈవో యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అల్లాదుర్గం, మార్చి 4: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఎంపీపీ అనీల్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, నాయకులు అభిలాష్‌రెడ్డి, బలరాం, బాలకిషన్, ప్రభు, మహేష్, సదానందం, విఠల్‌రెడ్డి, జైపాల్, మధుసూధన్, బేతయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీరోడ్డు పనులు ప్రారంభం

కంగ్టి/వట్‌పల్లి, మార్చి 4: కంగ్టి మండల పరిధిలోని ముకుంద్ తండాలో సీసీ రోడ్డు, మురికి కాలువల పనులను మాజీ జడ్పీటీసీ సర్దార్ రాథోడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు సురేఖవెంకట్‌నాయక్, నాయకులు చందర్‌రెడ్డి, మహిపతినాయక్, జాగీర్, గోవింద్, చందర్, తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన వట్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దిగంబర్‌రావు, నరసింహగౌడ్, గోపాల్‌రెడ్డి, సంగారెడ్డి, దశరథ్ గంగారం, రాందాస్ తదితరులు పాల్గొన్నారు

కొత్తపల్లి, దోమడుగులో గ్రామసభలు

గుమ్మడిదల, మార్చి 4: మండలంలోని కొత్తపల్లి, దోమడుగులో గ్రామాల్లో సోమవారం రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ధరణిలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఈ రెండు గ్రామాల్లో 85 దరఖాస్తులను పరిశీలించినట్లు డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాచమల్ల శ్రీనివాస్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ పోటీ కాదు

మనోహరాబాద్, మార్చి 4: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ పోటీయే కాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేష్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దాసరి నరేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు

చిన్నశంకరంపేట, మార్చి 4: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రసన్న కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి సూచించారు. పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలను వివరించారు.

ప్రధాని మోదీ సభను జయప్రదం చేయాలి

మెదక్ అర్బన్/నర్సాపూర్, మార్చి 4: విజయ సంకల్పయాత్రలో భాగంగా మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని పటేల్ గూడలో నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగసభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. సోమవారం మెదక్‌లోని పార్టీ కార్యాలయంతో పాటు నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఇన్‌చార్జి మురళీధర్ రావు, పార్లమెంటు ప్రబారి బసవలక్ష్మీనర్సయ్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, కౌన్సిలర్లు బుచ్చేస్ యాదవ్, సురేష్, యాదగిరి, అసెంబ్లీ కో కన్వీనర్ సతీష్‌యాదవ్, నాయకులు రమణారావు, శ్రీనివాస్‌గుప్తా, నాగరాజు, శంకర్, చంద్రయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.